www.prajanaava.in
Telugu Daily
# ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పేజీలు : 08 | వెల రూ.5.00

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న
ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
: 99484 33277 / 7288825681

Published from: Karimnagar, Circulated to: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad
హైదరాబాద్ | సంపుటి : 2 | సంచిక : 95 | సోమవారం | 16 సెప్టెంబర్, 2024





## మరో దఫా అధికారమే
# లక్ష్యం

పార్టీ శ్రేణులు అందుకు తగ్గట్టు పని చేయాలి

రాహుల్‌గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యం కావాలి

నా నాయకత్వంలో సైనికుల్లా కదం తొక్కారు..

పీసీసీ చీఫ్‌గా బాధ్యతలు సంతృప్తి నిచ్చింది

### కార్యకర్తల జోలికి వస్తే విడిచిపెట్టం

- మహేష్ కుమార్ సారథ్యంలో ముందుకు సాగుదాం
- పీసీసీ చీఫ్ బాధ్యతల స్వీకరణలో రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:** రాష్ట్రంలో మరో దఫా అధికారమే లక్ష్యంగా ముందు సాగుదామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం గాంధీభవన్‌లో కొత్త పీసీసీ చీఫ్‌గా మహేశ్‌గౌడ్ ప్రమాణ స్వీకారం సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. బీ మహేష్ కుమార్ గౌడ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి హృదయ పూర్వక అభినందనలు తెలిపారు. 38 నెలల పాటు ఈ బాధ్యతలు నిర్వర్తించడం తనకు పూర్తి సంతృప్తినిచ్చిందని పేర్కొన్నారు. తన నాయకత్వంలో లక్షలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు సైనికులుగా కదం తొక్కి, పోరాట పథంలో సాగి, అనేక త్యాగాలు చేసి, నియంత పాలనకు పాతరేశారన్నారు.

మిగతా 2 లో




### పీసీసీ చీఫ్‌గా మహేశ్ బాధ్యతల స్వీకరణ

- డిప్యూటీ సీఎం, మంత్రులు, ఏఐసీసీ ఇన్‌చార్జి, ముఖ్యనాయకులు హాజరు
- కొత్త సారథికి వెల్లువెత్తిన అభినందనలు

.. 2లో

# మున్సిపాలిటీనా? మజాకా!?

- మున్సిపాలిటీకి ఫిర్యాదు చేస్తే చెత్తబుట్టలోనే!
- అందుకే ప్రజావాణికి క్యూ కడుతున్న ప్రజలు!
- అవస్థలు పడుతున్న ఆదిలాబాద్ పట్టణవాసులు
- ప్రభుత్వాన్ని బద్నాం చేయాలన్న కుట్ర!?



ఆదిలాబాద్ పురపాలకులు వ్యవహరిస్తున్న తీరు తీవ్ర విమర్శల పాలవుతోంది. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మిషన్ భగీరథ' వల్ల తాగునీటి సమస్యలు దాదాపుగా తీరినప్పటికీ.. అక్కడక్కడా 'కొందరి' నిర్లక్ష్యం కారణంగా పలు అవస్థలు పడాల్సి వస్తోంది. దీనివల్ల సమస్యలు పట్టించుకోండి సార్..! అంటూ సాగిలపడితే.. ఉన్నదే పీకేస్తే సమస్య సాల్వ్ అంటూ చేతులు దులిపేసుకోవడం విమర్శలకు తావిస్తోంది. ఇదే గాక.. రోజంతా కూలీనాలి చేసుకునే బడుగుజీవి భూమిని కబ్జా చేసిన పోలీసు డిపార్ట్మెంట్ వ్యక్తి కబ్జా చేశాడని సదరు పోలీసాయనపై 20 సార్లు ఫిర్యాదు చేసినా ఒక్కసారీ కూడా చర్యలు తీసుకోకపోవడం వెనుక ఏదో రాజకీయ కుట్ర దాగి ఉ ండవచ్చని బాధిత ప్రజలు ప్రజావాణిలో కంప్లైంట్ చేసే వరకు వచ్చింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ స్పందిస్తూ చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తే.. అసలు ఈ సమస్యలకు కారణమైన వాటినే పీకేస్తే సరి.. పీడావోద్దని చేతులు దులిపేసుకుంటున్న వైనంపై 'ప్రజానావ' ఫోకస్....!

.. వివరాలు 2లో

# నీ గుండెల్లో నిద్రపోతున్నా..

- ఎక్కడో దాక్కోలేదు రేవంత్‌రెడ్డి.. నీ ఆలోచనల్లోనే ఉన్నా..
- 42 లక్షల మందికి రుణమాఫీ జరిగేదాకా విడిచిపెట్ట?
- రైతులను మోసం చేసిన సన్నాసి ఎవడు?
- నీకు ఐదేండ్లే ఎక్కువ.. రెండోసారికి సీన్ లేదు!
- మాజీ మంత్రి హరీశ్‌రావు ఘాటు విమర్శలు



**హైదరాబాద్, ప్రజానావ:** 'నేను ఎక్కడో దాక్కోలేదు.. నీ గుండెల్లో నిద్రపోతున్నా'.. అని సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి మాజీ మంత్రి హరీశ రావు ఘాటుగా విమర్శించా రు. ఆదివారం ఆయన తెలంగాణ భవన్ లో విలేకరులతో మాట్లాడారు. రాజీనామా చేస్తా అన్న సన్నాసి ఎక్కడ దాక్కున్నావ్ అని రేవంత్‌అన్న వ్యాఖ్యలపై ఆయన నిప్పులు చెరిగారు. నేను ఎక్కడో వెళ్లలేదని, నీకు నిద్ర పట్టనివ్వకుండా

మిగతా 2 లో

## జైజై గణేశా!

వరుస సెలవులు కావడంతో ఖైరతాబాద్ మహాగణపతి దర్శనానికి భక్తులు పోటెత్తారు. మెట్రో రైలు, ఎంఎంటీఎస్, ఆర్టీసీ బస్సుల్లో భక్తులు ఖైరతాబాద్‌కు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. పలు మెట్రో స్టేషన్లు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఎల్బీనగర్, మియాపూర్ నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో మెట్రో స్టేషన్ పరిసరాల ప్రాంతాల్లో జనసంద్రంగా మారాయి. ఆదివారం చివరి రోజు కావడంతో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



# భట్టి విక్రమార్కకు అరుదైన గౌరవం

### ప్రపంచ నోబెల్ శాంతి శిఖరాగ్ర సమావేశానికి ఆహ్వానం

#### 18 నుంచి 21వ తేదీ వరకు మెక్సికోలో సమావేశాలు



**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:** ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు అరుదైన గౌరవం లభించింది. నోబెల్ శాంతి శిఖరాగ్ర సమావేశానికి ఆహ్వానం అందింది. ఈ నెల 18 నుంచి 21వ తేదీ వరకు మెక్సికో దేశంలో న్యూవోలియోన్‌లోని మోంటిగ్రో నగరంలో జరగనున్న 19వ ప్రపంచ నోబెల్ శాంతి శిఖరాగ్ర సమావేశానికి హాజరు కావాల్సిందిగా డిప్యూటీ సీఎంకు నిర్వాహకుల నుంచి ఆహ్వానం లభించింది. ప్రగతి కోసం శాంతి అనే ప్రధాన అజెండాతో ఈ సమావేశాలు జరగనున్నాయి. నోబెల్ గ్రహీతలు, ప్రపంచ శాంతి న్యాయవాదుల సామూహిక విజ్ఞానాన్ని ఉపయోగించుకోవడమే లక్ష్యంగా ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు ఆహ్వానంలో పేర్కొన్నారు. ఒత్తిడితో కూడిన ప్రపంచ సమస్యల పరిష్కారానికి కార్యాచరణ, వ్యూహాలను ఈ శిఖరాగ్ర సమావేశంలో రూపొందిస్తామని ఆహ్వాన పత్రికలో నిర్వాహకులు తెలిపారు.



## ప్రజా వంచన దినోత్సవం
# జరుపుకోండి

- విమోచనం ఎందుకు నిర్వహించడం లేదో చెప్పండి
- జై పాలస్తీనా అని నినదించిన ఒవైసీని పొగుడుతారా?
- పరేడ్ మైదానంలో ఫోటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన బండి

.. 2లో

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
2
సోమవారం
16 సెప్టెంబర్ 2024

# మున్సిపాలిటీనా? మజాకా!?

- మున్సిపాలిటీకి ఫిర్యాదు చేస్తే చెత్తబుట్టలోనే.!
- అందుకే ప్రజావాణికి క్యూ కడుతున్న ప్రజలు.!
- అవస్థలు పడుతున్న ఆదిలాబాద్ పట్టణవాసులు
- ప్రభుత్వాన్ని బద్నాం చేయాలన్న కుట్ర.!?

## ఇదెక్కడ జరిగింది!

ఆదిలాబాద్ పట్టణంలోని తాటిగూడ కాలనీ.! 'మిషన్ భగీరథ' ద్వారా ఇంటింటికి నల్లా నీటిని అందజేస్తున్నామని గొప్పలు చెప్పుకున్న గత బీఆర్ఎస్ ప్రభుత్వం, రాజకీయ, స్థానిక నేతల ఒత్తిళ్లతో 2017లో ఒక మినీ వాటర్ ట్యాంక్ ను ఏర్పాటు చేసింది. అయితే ఆ ట్యాంక్ దగ్గరే బట్టలు ఉతకడం, అంట్లు తోమడం, స్నానాలు చేయడం లాంటి పనులు చేయడం వల్ల మురుగు నీరు నిలిచి.. దోమలు వృద్ధి చెంది.. రోగాలు ప్రబలుతున్నాయి. దీంతో ఒకసారి మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయగా, పట్టించుకోలేదు. ఆ తర్వాత ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు అక్కడ విచారణ చేపట్టారు. ఈ వాటర్ ట్యాంక్ మంజూరైన చోటున కాకుండా మరో చోట పెట్టారని, బట్టలు ఉతకం, అంట్లు తోమడం వల్ల పలువురికి అసౌకర్యంగా ఉందని, అంతేకాకుండా దీని నిర్వహణ మున్సిపాలిటీకి భారంగా మారిందని, నల్లాల ద్వారా ఇంటింటికి నీళ్లు సరఫరా చేస్తున్న సమయంలో అసలు ఆ ట్యాంక్ అవసరమే లేదని తేల్చి రిపోర్ట్ రాశారు. అంతగా అవసరమనుకుంటే ఆ ట్యాంక్ ను మంజూరు చేయబడిన ప్రాంతానికి మార్చాలని, లేకుంటే డిస్మెంటల్ చేయాలని స్పష్టంగా చెప్పారు. అయితే మున్సిపల్ కమిషనర్ తదుపరి ఎలాంటి చర్యలు తీసుకోలేదు.!

## డ్రైవర్ భూమి పోలీస్ కబ్జా

ఆదిలాబాద్ పట్టణంలోని రిక్షాకాలనీకి చెందిన పోలీస్ డిపార్ట్ మెంట్ లో కీలక స్థానంలో ఉన్న ఓ వ్యక్తి పక్కనే ఉన్న ఓ డ్రైవర్ స్థలాన్ని ఆక్రమించి, వెనక ఉన్న నాలా బఫర్ జోన్ లోనూ నిర్మాణం చేపడుతున్నాడు. దీనిపై కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తే నెలల సమయం తీసుకున్న మున్సిపల్ అధికారులు విచారణ చేపట్టి డ్రైవర్ స్థలాన్ని సదరు పోలీస్ డిపార్ట్ మెంట్ వ్యక్తి కబ్జా చేశాడని నిర్ధారించారు. అంతేకాకుండా అతడు చేపడుతున్న నిర్మాణం నిబంధనలకు విరుద్ధమని తేల్చి షోకాజ్ నోటీస్ సైతం జారీ చేశారు. అంతకుముందు అతడిపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేశారు. అయితే దీనికి బాధితుడు 20కి పైగా అర్జీలు ఇవ్వాల్సి వచ్చింది. అయినా పేపర్ వర్క్ కు మాత్రమే పరిమితమైన మున్సిపల్ అధికారులు పోలీస్ డిపార్ట్ మెంట్ కు చెందిన వ్యక్తిపై చర్యలు తీసుకోవడానికి సాహసించలేదు. మళ్లీ మున్సిపల్ అధికారులను కదిలించాలంటే అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్), ప్రజావాణిలో కలెక్టర్ కు మళ్లీ ఫిర్యాదు చేస్తే.. అప్పుడు మళ్లీ నోటీసుల పరంపర మొదలుపెట్టారు తప్పితే.. చర్యలు తీసుకోవడానికి మాత్రం జంకుతున్నారు.

## పై రెండు ఉదాహరణలు చాలు..

ఆదిలాబాద్ జిల్లా కేంద్రం లోని ప్రజలు అనేక ఇబ్బందులు పడుతుండడానికి మున్సిపాలిటీ అధికారులు ఎలా బాధ్యులవుతున్నారో తెలియజేయడానికి.. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం, పట్టింపులేని తనం, పని చేయకుండా ఉండడం ఆదిలాబాద్ జిల్లా కేంద్ర ప్రజలకు శాపంగా మారింది. ఓ వైపు చెరువులు, నాలాల బఫర్ జోన్లలో కట్టడాలు ఉన్నా.. పట్టించుకోకుండా వదిలేస్తుండడంతో ఇండ్లలోకి నీరుచేరుతున్నది. మరోవైపు పారిశుధ్య నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలు చేపట్టకపోవడంతో రోగాలు ప్రబలుతున్నాయి.

## అక్రమ కట్టడాలతో అనేక ఇబ్బందులు..

అక్రమ కట్టడాల పట్ల ఆదిలాబాద్ మున్సిపాలిటీ అధికారులు సరైన చర్యలు తీసుకోవడం లేదు. చెరువుల ఎఫ్టీఎల్, బఫర్ జోన్, నాలాల బఫర్ జోన్లలోనూ పలువురు నిర్మాణాలు చేపడుతున్నారు. సెట్ బ్యాక్స్ వదలకుండా నిబంధనలకు విరుద్ధంగా అనేక మంది బిల్డింగుల మీద బిల్డింగులు కట్టేస్తున్నారు. ఫిర్యాదులు వస్తే చాలా వరకు బిల్డింగులు 'అన్ ఆథరైజ్డ్' అని నిర్ధారిస్తున్న మున్సిపల్ అధికారులు నోటీసుల వరకు మాత్రమే పరిమితమవుతున్నారు. ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో అధిక వర్షాలు కురిసినప్పుడు చెరువుల చుట్టూ, నాలాల వద్ద ఉన్న ఇండ్లలో నీరు చేరుతున్నది. అక్రమార్కులు చేసి పాపానికి సామాన్య, పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు ఇండ్లు విడిచిపెట్టి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ వంటి నగరంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక వ్యవస్థ అయిన హైడ్రా.. అక్కడ చెరువులు, నాలాల ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలో కట్టిన కట్టడాలను కూల్చివేస్తున్నది. ఇలాంటి పరిస్థితుల్లో ఆదిలాబాద్ కు సైతం అలాంటి వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆదిలాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వానికి విన్నవించారు. ఆ వినతికి స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి.. ఆయా జిల్లాల్లో హైడ్రా లాంటి వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సంబంధిత జిల్లా కలెక్టర్లకు సూచించారు.

## మున్సిపాలిటీ తీరువల్లే పారిశుద్ధ్య 'శాపం'

ఆదిలాబాద్ మున్సిపాలిటీ తీరు వల్ల జిల్లా కేంద్రంలో పారిశుధ్య లోపం కనిపిస్తున్నది. దీంతో రోగాలు ప్రబలి రిమ్స్ లో రద్దీ పెరుగుతున్నది. పారిశుధ్య లోపానికి కారణమవుతున్న తాటిగూడలోని మినీ వాటర్ ట్యాంక్ ను మున్సిపల్ అధికారులు తొలగించకపోవడం ఉద్దేశ్యపూర్వకమనే విమర్శలున్నాయి. ప్రస్తుతం మున్సిపల్ పాలకవర్గం బీఆర్ఎస్ చేతుల్లో ఉన్నది. దీంతో కాంగ్రెస్ పై ప్రజా వ్యతిరేకత తీసుకురావడానికి కొందరు కౌన్సిలర్లు.. మున్సిపల్ అధికారులు, సిబ్బందితో మిలాఖత్ అయి పారిశుధ్య నిర్వహణ సరిగా జరగకుండా చూస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కావాలనే మురుగు కాల్వలు తీయకపోవడం, ఒక్కో ప్రాంతంలో నాలుగైదు రోజులు చెత్త సేకరించే వాహనాలను పంపించకపోవడం లాంటివి చేస్తున్నారనే విమర్శలున్నాయి.

## కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేసే కుట్ర!?

రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఉపయోగపడే పనులు చేస్తున్నదని ప్రజలు క్రమంగా గుర్తిస్తున్నట్టు వార్తలొస్తున్నాయి. ఇచ్చిన హామీలు అమలు చేస్తుండడంతో సామాన్య ప్రజల్లో ఆనందం వెల్లివిరుస్తున్నదని ప్రచారం జరుగుతోంది. ఉచిత బస్సు ప్రయాణం..రుణమాఫీ..రూ. 500కే గ్యాస్ సిలిండర్.. ఇండ్లకు ఫ్రీ కరెంట్ వాటితో ప్రజలకు కాస్తంతతైనా ఆర్థిక ఇబ్బందులు దూరమవుతున్నాయి. దీంతో ప్రతిపక్షాలకు ఎలాంటి అస్త్రాలు దొరకడం లేదు. దీంతో విపక్ష పార్టీలకు చెందిన కొందరు మున్సిపల్ అధికారులతో చేతులు కలిపినట్లు ప్రచారం జరుగుతున్నది. అందుకే ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై కావాలనే మున్సిపల్ అధికారులు స్పందించడం లేదని తెలుస్తున్నది. అంతేకాకుండా మున్సిపాలిటీకి చెందిన కొందరు ఉన్నతాధికారులు విపక్ష పార్టీలకు చెందిన నేతల ఇండ్లకు తరచూ వెళ్తుండడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నది.!


## కూలగొడుతాం.. వేరే చోటుకు మార్చుతాం..

**- ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్ ఖమర్‌అహ్మద్**

ఈ విషయమై, ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్ ఖమర్‌అహ్మద్‌ను వివరణ కోరగా, ట్యాంకు విషయంలో చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజావాణి ఫిర్యాదుపై తాము విచారణ చేపట్టామని చెప్పారు. సంబంధిత అధికారులతో నివేదిక తెప్పించుకున్నామన్నారు. ఆ ట్యాంకును వేరే చోటుకు మార్చే పరిస్థితులను చూస్తున్నామని వివరించారు. ప్రస్తుతం కాలనీవాసులకు నీటి ఇబ్బందులు కలుగకుండా, ప్రస్తుతం దానిని అక్కడే కొనసాగిస్తామని, ట్యాంకును మరో చోటుకు మార్చేందుకు స్థలం కోసం చూస్తున్నామని, కొత్త ట్యాంకు నిర్మించిన తర్వాత తాటిగూడలో ఉన్న ట్యాంకును కూలగొడతామని చెప్పారు. దానికి మున్సిపల్ కౌన్సిల్‌లో చర్చించి, నిధుల మంజూరు కోసం చర్యలు చేపడతామని పేర్కొన్నారు. నిధులు సమకూరగానే, ట్యాంకును వేరే చోటుకు మార్చుతామని వివరించారు.







## పీఆర్టీయూఎస్‌నూతన కార్యవర్గం ఎన్నిక

**నేరడిగొండ, ప్రజానావ:** మండల కేంద్రంలో పీఆర్టీయూఎస్ మండల శాఖ నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో నేరడిగొండ మండల శాఖ నూతనంగా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కటుకూరి గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్ గౌడ్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్ చందర్ ఠాక్రే, ప్రధాన కార్యదర్శి కూడాల రవీందర్ రెడ్డి, ఎంఈఓ భూమారెడ్డి, వివిధ మండలాల నుంచి వచ్చిన జిల్లా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నేరేడిగొండ మండల ప్రాథమిక సభ్యులు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి ఆదిలాబాద్ జిల్లా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో సంఘం బలోపేతానికి కృషి చేస్తామని అన్నారు.




# మరో దఫా అధికారమే లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

పార్టీని అధికారంలోకి తెచ్చి, రాష్ట్రంలో ప్రజా పాలనకు నాంది పలికారన్నారు. సోనియాగాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టారన్నారు. వారందరికీ శిరస్సు వంచి నమస్కరిస్తున్నా అని రేవంత్ రెడ్డి తెలిపారు. రాబోయే రోజుల్లో అదే నమ్మకాన్ని కొనసాగిస్తామన్నారు. పార్టీని మరింత పటిష్ఠం చేసి, రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేయడం, మరో దఫా రాష్ట్రంలో కాంగ్రెస్ ను అధికారంలోకి తేవడమే లక్ష్యంగా పని చేస్తామని స్పష్టం చేశారు. ఇందుకు మహేష్ కుమార్ గౌడ్ సారథ్యంలో పార్టీ ముందుకు సాగాలని, ఆ దిశగా అవసరమైన అన్ని సహాయసహకారాలు అందించడానికి తాను సిద్ధంగా ఉన్నానని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## మాట ఇస్తే జరిగితీరుందని నిరూపించాం..

రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ చేస్తామని వరంగల్ డిక్లరేషన్‌లో రాహుల్ గాంధీ ప్రకటించారని, కాంగ్రెస్ మాట ఇస్తే.. తప్పక జరిగితీరుతుందని నిరూపించామని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన 6 నెలల్లో రూ. 2లక్షల రుణమాఫీ చేసి చూపించామని చెప్పారు. ఆర్టీసీలో ఇప్పటివరకు 85 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణాలు చేశారననారు. మోదీ ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధర పెంచి మహిళలకు భారంగా మార్చిందని చెప్పారు. తాము రూ. 500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని పేర్కొన్నారు. వ్యవసాయ రుణం రూ. 2 లక్షలకు పైగా ఉన్న రైతులు భయపడొద్దన్నారు. రూ. 2లక్షలకుపైగా ఉన్న మొత్తాన్ని రైతులు బ్యాంకుల్లో చెల్లిస్తే రూ. 2లక్షల రుణమాఫీ పూర్తవుతుందని చెప్పారు.

## 30వేల ఉద్యోగాలిచ్చాం..

కేసీఆర్ కుటుంబంలో ఉద్యోగాలు పోతేనే యువతకు ఉద్యోగాలు వస్తాయని చెప్పామని, ఇప్పటికే 30వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్ ఇచ్చి విద్యార్థులకు ఎంతో మేలు చేశామని గుర్తు చేశారు. ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ. 10లక్షలకు పెంచామని, ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మాణంతో హైదరాబాద్ గమనమే మారిపోయిందన్నారు. కొత్తగా నిర్మించే రీజినల్ రింగ్‌రోడ్డుతో తెలంగాణ స్వరూపమే మారుతుందని చెప్పారు. ఇప్పటివరకు జరిగిన ఎన్నికలు, విజయాలు సెమీఫైనల్స్ మాత్రమేనని, రాహుల్ గాంధీని ప్రధానిని చేసినప్పుడే, మనం ఫైనల్స్‌లో గెలిచినట్లు అని పిలుపునిచ్చారు. 2029 ఫైనల్స్‌లో మనం ఘన విజయం సాధించాలన్నారు. 1994 నుంచి రాష్ట్రంలో ప్రతిపార్టీ రెండు సార్లు గెలిచిందని, కాంగ్రెస్ కూడా కచ్చితంగా వరుసగా రెండు సార్లు అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ కార్యకర్తల జోలికి ఎవరైనా వస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.



## రాజకీయాల్లో కష్టంతోపాటు కొంచెం అదృష్టం ఉండాలి: మహేశ్ కుమార్‌గౌడ్

తాను వెలుగులోకి రానప్పటికీ కాంగ్రెస్ పార్టీ ఎన్నో అవకాశాలు ఇచ్చిందని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సభలో మాట్లాడారు. "మనం ఎంత పనిమంతులం అయినా.. చేసేందుకు పని ఇచ్చేవారు కూడా ఉండాలి. నమ్మి పని ఇచ్చేవారు లేకపోతే మన ప్రతిభ బయటకు రాదు. రాజకీయాల్లో కష్టంతోపాటు కొంచెం అదృష్టం ఉండాలి. సీఎం రేవంత్‌రెడ్డి చదువు, వైద్యం, క్రీడల విషయంలో దూరదృష్టితో ఆలోచిస్తున్నారు. వారంలో ఇద్దరు మంత్రులు గాంధీభవన్‌కు వస్తే మంచిది. గాంధీభవన్ మీద ఆశ, నమ్మకంతో వచ్చిన కార్యకర్తలకు న్యాయం చేయాలి. ఇవాళ చిన్న ప్రాంతీయ పార్టీలకు కూడా జిల్లాల్లో పార్టీ కార్యాలయాలు ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ కూడా జిల్లాల్లో పార్టీ కార్యాలయాలు నిర్మించుకోవాల్సి ఉంది" అని మహేశ్ కుమార్‌గౌడ్ తెలిపారు.

## పీసీసీ చీఫ్‌గా మహేశ్ బాధ్యతల స్వీకరణ

**హైదరాబాద్, ప్రజానావ:** తెలంగాణ కాంగ్రెస్ కొత్త సారథిగా మహేశ్‌కుమార్‌గౌడ్ బాధ్యతలు స్వీకరించారు. ఆదివారం గాంధీభవన్ లో రేవంత్ ఆయనకు బాధ్యతలు అప్పగించారు. మహేష్ కుమార్ బాధ్యతల స్వీకరణకు పార్టీ నేతలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. తన ఇంటి నుంచి భారీ ర్యాలీతో గాంధీ భవన్ కు చేరుకున్నారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, ఏఐసీసీ ఇన్‌చార్జి కార్యదర్శులు, మంత్రులు, ముఖ్య నాయకులు హాజరయ్యారు. గాంధీ భవన్‌లోని ఆయన ఛాంబర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించి బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతల స్వీకరణకు ముందు గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపానికి మహేశ్ కుమార్ గౌడ్ నివాళులు అర్పించారు. అక్కడి నుంచి గాంధీ భవన్‌కు తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షితో కలిసి భారీ ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తూ క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా తన వంతు ప్రయత్నాలు చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన సీఎం రేవంత్ రెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకులకులతో పాటు తనపై నమ్మకం ఉంచి హైకమాండ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# నీ గుండెల్లో నిద్రపోతున్నా..

మొదటి పేజీ తరువాయి

అనుక్షణం రుణమాఫీ గురించి గుర్తు చేస్తానని చెప్పారు. మెడలు వంచి రుణమాఫీ చేయించానని, మిగతా సగం మాఫీ చేసేదాకా వెంట పడుతూనే ఉంటానని స్పష్టం చేశారు. 42 లక్షల మంది రైతులకు రుణమాఫీ అయ్యేదాకా అడుగడుగనా నిలదీస్తానని, పూర్తయ్యేదాకా విడిచిపెట్టే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. 'రైతు కండ్లలో ఆనందం చేశాడట రేవంత్‌రెడ్డి.. కానీ, రుణమాఫీ కాక, రైతుభరోసా రాక కన్నీళ్లు పెట్టుకోవడం కనిపించడం లేదా? రైతుల ఉసురు పోసుకుంటున్నావ్? దొడ్డు వడ్లకు బోనస్ ఇప్పిస్తానని చెప్పి రైతులను మోసం చేసిన సన్నాసి ఎవడు? అని అడుగుతున్నా?' అని రేవంత్‌రెడ్డిని నిలదీశారు.

## రెండోసారి సీన్‌లేదు..

'నీకు ఐదేండ్లే ఎక్కువ.. రెండోసారికి సీన్ లేదు'.. అని రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు చురకలంటించారు. ఆయన దిగజారుడు మాటలతో ఆయన గౌరవం పోతే బాధలేదని, కానీ సీఎం కుర్చీ గౌరవం కాపాడాలని హరీశ్‌రావు హితవు పలికారు. తన ఎత్తుపై పరుష పదజాలంతో మాట్లాడడంపై మండిపడ్డారు. 'నేను తాటి చెట్టంతా ఎదిగాను.. మరి నీవు వెంపలి చెట్టంతా కూడా ఎదగలేదు కదా..? అని కౌంటర్ ఇచ్చారు. రాష్ట్రంలో ప్రజలు రెండు రకాల వరదలతో ఇబ్బందులు పడుతున్నారని, ఒకటి ప్రకృతి వైపరీత్యం కారణం వచ్చిన వరదలతో కాగా, మరోటి సీఎం అబద్ధాల వరదతో అని వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డి అబద్ధాలు మోరీ కంపును మించిపోయాయని, ఇవాళ నిసిగ్గుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

## నేను లిల్లిపుట్ అనలేనా?

తన గురించి ఏం మాట్లాడారో ప్రజలంతా చూశారని, కానీ తనకు రేవంత్‌లా మాట్లాడానికి మర్యాద, సంస్కారం అడ్డు వస్తున్నాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. 'నీవు లిల్లీఫుట్ అంత లేవు అని అనలేనా..? నేను నిన్ను సన్నాసి అనడం పెద్ద కష్టమైనా పనా? నా ఎత్తు గురించి దుర్భాషలాడుతున్నావు.. నా ఎత్తు మీద నీకు అంత ఈర్ష్య ఎందుకు? దేవుడు ఇచ్చిన సృష్టి. అది భగవంతుడు ఇచ్చిన వరం. నా ఎత్తు మీద ఎందుకు అసూయపడుతున్నావు. ఎంత తిట్టినా.. ఎంత మాట్లాడినా నా అంత ఎత్తు పెరగలేవు. ఆ స్టేజీ దాటిపోయింది. నా ఎత్తు గురించి మాట్లాడం మానేసి.. రైతుల గురించి ఆలోచించండి. నేను పొడుగే.. తెలంగాణ ఉద్యమం మరింత పొడుగు చేసింది. కానీ నువ్వేంది.. నీ బుద్ధి కురచ, నీ చరిత్ర కురచ, నీ భాష కురచ.. నీ కురచతనం వల్ల నా పొడుగు గురించి మాట్లాడి నీ విలువ తగ్గించుకుంటున్నావ్. రాష్ట్రం, ప్రజల గురించి ఆలోచించు. నీవు వెంపలి చెట్టంతా కూడా ఎదగలేదు కదా..? నీకు దేవుడు అంతే ఇచ్చిండు. ఒక ముఖ్యమంత్రిగా ప్రజలకు మేలు చేయడం గురించి మాట్లాడు'.. అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## మొన్న ఏడ్చినంత పని చేశావు..

మొన్న రేవంత్ రెడ్డి ఎక్కడో మాట్లాడుతూ.. తనకు కాకున్నా.. తన కుర్చీకైనా మర్యాద ఇవ్వండంటూ ఏడ్చినంత పని చేశారని హరీశ్‌రావు గుర్తు చేశారు. మరి ఆ మర్యాద దక్కాలంటే మర్యాదగా వ్యవహరించాలని కదా అని సూచించారు. భాష, వ్యవహార శైలి, నడవడిక మర్యాదగా ఉండాలని, అప్పుడు మర్యాద లభిస్తుందని పేర్కొన్నారు. నోరు తెరిస్తే బూతులు, అబద్ధాలు మాట్లాడితే, మర్యాద ఎలా దొరుకుతుందని ప్రశ్నించారు. గాంధీ భవన్‌లో పీసీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టే సందర్భంగా ఎన్నో అబద్ధాలు మాట్లాడారని ధ్వజమెత్తారు.

# ప్రజా వంచన దినోత్సవం జరుపుకోండి

**హైదరాబాద్, ప్రజానావ:** సెప్టెంబర్ 17న కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ విమోచన దినోత్సవం ఎందుకు నిర్వహించడం లేదో సమాధానం చెప్పాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. 'తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం' పేరుతో ఆ పార్టీ తెలంగాణ ప్రజలను వంచిస్తోందన్నారు. 50 ఏళ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస పార్టీ ప్రజలను వంచించినందున 'తెలంగాణ ప్రజా వంచన దినోత్సవాన్ని' నిర్వహించుకోవాలని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజలను రాచిరంపాన పెట్టిన రజకార్ల పార్టీ వారసులకు కాంగ్రెస్ వత్తాసు పలకడం సిగ్గు చేటన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవాల నేపథ్యంలో సికింద్రాబాద్ లోని పరేడ్ మైదానంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ ను ఆదివారం కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రారంభించారు. రాజ్యసభ ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ తోపాటు పలువురు నేతలతో కలిసి ఫొటో ఎగ్జిబిషన్ ను బండి తిలకించారు. అనంతరం వారితో కలిసి మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పై నిప్పులు చెరిగారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని కేంద్రం అధికారికంగా నిర్వహించాలని మాట ఇచ్చిన తరువాత వరుసగా ఉత్సవాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. గతేడాది మాదిరిగానే ఈసారి కూడా మోదీ ఆదేశాలు, అమిత్ షా సూచనల మేరకు కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కేంద్ర హోంశాఖ భాగమై ఈ ఉత్సవాలు నిర్వహిస్తోందన్నారు. అందులో భాగంగా సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ ను ప్రారంభించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఫొటో ఎగ్జిబిషన్ ను చూడగటానే నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణకు విముక్తి కోసం చేసిన పోరాటాలు, సమర యోధుల త్యాగాలను కళ్లకు కట్టినట్లుగా చూపారు.

## మరి కాంగ్రెస్‌కు ఏం అర్హత ఉందో?

తెలంగాణ విమోచన దినోత్సవాలు జరిపే అర్హత బీజేపీకి లేదన్న కాంగ్రెస్ వ్యాఖ్యలపై బండి స్పందించారు. మరి కాంగ్రెస్ కు మాత్రమే ఆ అర్హత ఉంటే ఇప్పటి వరకు తెలంగాణ విమోచన దినోత్సవాలను ఎందుకు నిర్వహించడం లేదు? అని ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనూ 50 ఏండ్ల పాటు రాష్ట్రాన్ని పాలించారు కదా! మరి నాటి నుంచి ఎందుకు నిర్వహించలేదని అడిగారు. నాటి తెలంగాణ పోరాట యోధులను ఎందుకు స్మరించలేదని, ఆపరేషన్ పోలో నిర్వహించిన సర్దార్ పటేల్ ను ఎన్నడైనా స్మరించిందా? అని ఘాటుగా విమర్శించారు.

## అప్పుడో మాట.. ఇప్పుడో మాట..

తెలంగాణ విమోచన దినోత్సవాలపై అధికారంలో లేనప్పుడు ఒకమాట.. వచ్చాక మరోమాట.. ఇదీ కాంగ్రెస్, బీఆర్ఎస్ తీరు అని బండి సంజయ్‌దుయ్యబట్టారు. ఒక పార్టీ ఏమో 'సెప్టెంబర్ 17న సమైక్యత దినోత్సవం' అంటది.. ఇప్పుడున్న కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ 'ప్రజాపాలనా దినోత్సవం' నిర్వహిస్తుందట. మరి దాదాపు 50 ఏండ్లు రాష్ట్రాన్ని ఏలారు కదా! ఇన్నాళ్లు మీరు చేసింది ప్రజా వంచనా? అని అడిగారు. ప్రజా వంచన దినోత్సవంగా నిర్వహించుకోండని అన్నారు. 'నేనడుగుతున్నా.. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పేరు మార్చి 'తెలంగాణ ప్రజా పాలనా దినోత్సవం' అని మార్చడానికి కారణమేంటి? బీజేపీ అధికారంలో ఉన్నా, లేకున్నా ఒకటే మాట. తెలంగాణ విమోచన దినోత్సవం జరపాలన్నదే మా లక్ష్యం. అదే చేస్తున్నం. తెలంగాణ విమోచన దినోత్సవాలను అధికారికంగా జరిపితే... మేమంతా పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్నాం' అని స్పష్టం చేశారు.



ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
సోమవారం
16 సెప్టెంబర్ 2024




# మంత్రి సీతక్కను కలిసిన ఆదివాసీ నాయకులు

**బెజ్జూర్, ప్రజానావ:** మండలం లోని కుశ్నపల్లి నుంచి గూడెం (వయా సోమిని) హేటిగూడ నుండి కమ్మర్గాం, కమ్మర్గాం నుండి మురలిగూడ, పెంచికల్ పేట్ మండలం నుండి నందిగాం (వయా అగరూడ) గ్రామాలకు రోడ్డు మరమ్మత్తులు శాశ్వత రోడ్ల నిర్మించాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు బెజ్జూరు మండల ఆదివాసీ నాయకులు కోరారు. ఆదివారం ఆమెను కలిసి విన్నవించారు. ఈ కార్యక్రమంలో మండల సర్, మేడి కొడప శంకర్, కొడవ విశ్వేశ్వర్, సడ్మెక రమేష్ పొర్తెటి ప్రభాకర్, కొరెత లాలయ్య , కొడప పుల్లయ్య , ఆదివాసి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పీడీఎస్ బియ్యం పట్టివేత

**సిర్పూర్(టీ), ప్రజానావ:** మహారాష్ట్రకు తరలిస్తున్న 20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్టు సిర్పూర్(టీ) ఎస్సై కమలాకర్తెలిపారు. పక్కా సమాచారం మేరకు ఆదివారం మండలంలోని జక్కాపూర్ వద్ద బొలెరో వాహనాన్ని తనిఖీ చేయగా, బియ్యం దొరికిందన్నారు. బియ్యం తరలిస్తున్న కాగజ్నగర్కు చెందిన అఫ్జల్, తాజ్ అనే వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. వీరిద్దరు కాగజ్నగర్లో తక్కువకు బియ్యం కొని, మహారాష్ట్రకు తరలిస్తున్నారని చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నారన్నారు.




# టీయూడబ్ల్యూజేతోనే జర్నలిస్టులకు న్యాయం

- రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ

**హైదరాబాద్, ప్రజానావ:** సుదీర్ఘ పోరాటాల చరిత్ర కలిగి ఉన్న తమ సంఘం నిరంతరం జర్నలిస్టుల సంక్షేమం, మీడియా స్వేచ్ఛ పరిరక్షణ కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తుందని, ఈ సంఘంతోనే తమకు న్యాయం జరుగుతుందనే బలమైన నమ్మకం జర్నలిస్టుల్లో ఉందని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు కే. విరాహత్ అలీ అన్నారు. శనివారం సాయంత్రం నాగర్ కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన 22 మంది సీనియర్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు, 143 సంఘానికి రాజీనామా చేసి, బషీర్ బాగ్ లోని కార్యాలయంలో , విరాహత్ అలీ సమక్షంలో టీయూడబ్ల్యూజే-ఐజేయులో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీలకు, ప్రభుత్వాలకు అనుబంధంగా పనిచేసే సంఘాలు మనుగడ సాధించలేవని, గడిచిన 65 ఏండ్లలో తమ సంఘం ఎన్నో పార్టీలను, ఎన్నో ప్రభుత్వాలను చూసిందని, అయినా ఎప్పుడూ జర్నలిస్టుల గొంతుకగానే పనిచేస్తూ వస్తుందని, అందుకే నాటి నుండి నేటి వరకు రాష్ట్రంలో వేలాది జర్నలిస్టుల ఆదరాభిమానాలు పొందుతున్నట్లు విరాహత్ అలీ స్పష్టం చేశారు. సంఘ సలహాదారు కె.శ్రీనివాస్ రెడ్డి మీడియా అకాడమీ ఛైర్మన్ బాధ్యతలు స్వీకరించిన మరుసటి రోజు నుండే జర్నలిస్టుల సంక్షేమ చర్యలపై నిమగ్నమై పోవడం అభినందనీయమన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం పట్ల సానుకూలంగా ఉందని, త్వరలో వేలాది మంది జర్నలిస్టులతో హైదరాబాద్ లో, భారీ సభను నిర్వహించి,





ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డితో పాటు సమాచార, ఆరోగ్య శాఖల మంత్రులను ఆ సభకు ఆహ్వానించి, జర్నలిస్టుల ప్రధాన సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఆయన తెలిపారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జి.మధుగౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కర్నయ్య, హెచ్.యూ.జే అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను కొల్లాపూర్ జర్నలిస్టులు విరాహత్ అలీ దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

# జోరుగా డైలీ ఫైనాన్స్ దందా?

- పేదల అవసరాలే ఆసరాగా వడ్డీ వసూళ్లు
- ఖాళీ చెక్కులు, నోట్లు రాయించుకుని వేధింపులు
- తనఖా పేరుతో ఆస్తులు సేల్ డీడ్ రాయించుకుని బెదిరింపులు
- ఆస్తులు అమ్ముకుంటున్న బాధితులు
- బోథ్ నియోజకవర్గంలో యథేచ్ఛగా అక్రమ వ్యాపారం..



**నేరడిగొండ, ప్రజానావ:** వడ్డీ వ్యాపారులు సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్నారు. 100రూపాయలకు ఐదు నుంచి పది రూపాయల వరకు వడ్డీ వసూలు చేస్తూ దోచుకుంటున్నారు. అవసరాల కోసం కొందరు, ఆపద అత్యవసర సమయాల్లో మరి కొందరు అధిక వడ్డీ అయినప్పటికీ అప్పులు తీసుకుంటూ తిరిగి చెల్లించలేక ఆస్తులను తెగనమ్ముకుంటున్నారు. సామాన్య, మధ్యతరగతి ప్రజల బలహీనతను అక్రమ వడ్డీ వ్యాపారులు నగదుగా మార్చుకుంటున్నారు. రెట్టింపు వడ్డీతో అధికంగా చిరువ్యాపారులే నిలువు దోపిడీకి గురవుతున్నారు. అధిక వడ్డీకి డబ్బులు ఇచ్చి సెక్యూరిటీగా వాహనాలు, విలువైన సెల్ ఫోన్లు, ఇతర ఆస్తుల తాకట్టు పెట్టుకుంటున్నారు. ఈ వడ్డీ వ్యాపారుల వ్యవహారంతో కొందరు ప్రాణాలను బలి తీసుకుంటుండగా మరికొందరు కోట్ల ఆస్తులను కోల్పోతూ రోడ్డున పడుతున్నారు. వడ్డీ చెల్లించలేని పరిస్థితుల్లో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కొంతకాలం కిందట ఇదేవిధంగా ఒక ప్రైవేటు విద్యాసంస్థ డైరెక్టర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలన సృష్టించింది. గత ఏడాది ఆదిలాబాద్ జిల్లాలో అక్రమ ఫైనాన్స్ వ్యాపారులపై దాడులు చేయగా అనేకమంది పోలీసుల వలలో చిక్కారు. లక్షల రూపాయలను వారి నుంచి స్వాధీనం చేసుకున్నారు. అలాగే అనేక డాక్యుమెంట్లను వడ్డీవ్యాపారుల అధికారులు బయటకు తీశారు. వారిపై కేసులు కూడా నమోదయ్యాయి. రోజు కష్టపడే కూరగాయలు, పండ్ల, ఫుట్పాత్ వ్యాపారులు రోజువారీగా తీసుకున్న అప్పుకు వడ్డీ చెల్లించడానికి సంపాదన సరిపోకపోవడంతో బతుకులు వడ్డీలతో చితికి వారిపోతున్నాయి. వడ్డీ అక్రమ వ్యాపారంలో ప్రభుత్వ ఉద్యోగులు ఉమ్మడి జిల్లాలోని ఎలాంటి అనుమతి లేకుండా నడుపుతున్న ఈ అక్రమ వడ్డీ వ్యాపారంలో ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తున్నది. రోజువారీ వడ్డీ వ్యాపారంలో పదివేల రూపాయలు అప్పుగా తీసుకుంటే ఇందులో ముందుగానే 1000నుంచి 1500 వరకు తగ్గించి ఎనిమిది వేల నుంచి 9000 మాత్రమే అప్పు ఇస్తుంటారు. ఇలా ఇచ్చిన తొమ్మిది వేల రూపాయలు అప్పుకు 100రోజుల్లో రోజుకు 100రూపాయల వంతున 10000 వసూలు చేస్తున్నారు. కూరగాయల వ్యాపారులు పండ్ల వ్యాపారులకు ఉదయం రూ.9 వందలు అప్పు ఇచ్చి సాయంత్రం 1000రూపాయలు వసూలు చేస్తున్నారు. రోజువారి అప్పు 100రోజుల అప్పులకు ఒక గ్యారెంటీతో ప్రామిసరీ నోటుపై సంతకాలు తీసుకుంటున్నారు. అప్పు తీసుకున్నవారినుంచే డాక్యుమెంట్ ఖర్చులు లక్ష అప్పులకు సెక్యూరిటీగా ఇండ్లు భూముల రిజిస్ట్రేషన్ డాక్యుమెంటం తీసుకోవడం ఆస్తులను మార్ట్ గేజ్ జీపీఏ లేదా రిజిస్ట్రేషన్ చేయించు కోవటం విలువైన వస్తువులను సెక్యూరిటీగా పెట్టుకుంటున్నారు. కొందరు ప్రభుత్వ ఉద్యోగులు అప్పులు తీసుకున్న సందర్భంలో వారు ఏటీఎం కార్డులను ఈ వడ్డీ వ్యాపారులు వారి వద్దనే ఉంచుకొని వేతనాలు బ్యాంకు ఖాతాలో జమ కాగానే డ్రా చేసుకుంటున్నారు. వడ్డీ వసూలుకు సంబంధించిన ఖర్చులు కూడా అప్పు తీసుకున్న వారే భరించాల్సి ఉంటుంది. వాయిదా ప్రకారం వడ్డీ అప్పులు చెల్లించని వారి ఇంటికి మనుషులను పంపిస్తూ వారి ఖర్చులను కూడా అప్పు తీసుకున్న వారి ఖాతాలో జమ చేస్తున్నారు. ఒకసారి లోన్ రికవరీ కోసం వెళ్లితే రూ.1000 ఖర్చు కింద వసూలు చేస్తున్నారు. అప్పులు వసూలుకు వడ్డీ వ్యాపారులు కొందరు ఏజెంట్లుగా నియమించుకొని వారిని అప్పు తీసుకున్న వారింటికి ఉదయమే పంపించి ఇంటి వద్దనే మకాం వేసి అవసరం అయితే బెదిరింపులకు పాల్పడుతూ బలవంతంగా వసూలు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి . అప్పులు తీర్చలేని సమయంలో వడ్డీ వ్యాపారుల వద్ద సెక్యూరిటీగా ఉన్న గ్యారెంటర్ పై ఒత్తిడి తీసుకురావడం అది సాధ్యంకాని సందర్భంలో ఇండ్లు భూములను ఆక్రమించడం చేస్తున్నారు. అప్పుల ముసుగులో ఇంత దోపిడీ జరుగుతున్న బాధితులు చెప్పుకోలేని పరిస్థితి ఉంది ఈ విషయం ఎవరికైనా చెబితే మళ్లీ అప్పులు ఇచ్చే వారు ఉండరని భయపడుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా వడ్డీ వ్యాపారం జరుగుతున్న ఈ దోపిడీని అరికట్టాల్సిన చిట్ రిజిస్టర్ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆదాయపన్ను శాఖ పోలీసులు ఈ అక్రమ దందాపై దృష్టి సారించి సామాన్యుల నడ్డి విరుస్తున్న వడ్డీ దందాకు పులిస్టాప్ పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.



## అక్రమంగా వడ్డీ వ్యాపారం చేస్తే చర్యలు



అనుమతులు లేకుండా డైలీ ఫైనాన్స్ నిర్వహిస్తూ సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న డైలీ ఫైనాన్స్ వ్యాపారస్తులపై కఠిన చర్యలు తీసుకుంటాం గతంలో జిల్లా వ్యాప్తంగా ఇచ్చోడ సర్కిల్లో కూడా పోలీసులు టీంలుగా ఏర్పడి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దాదాపు ఏడు, ఎనిమిది కేసులు కూడా నమోదు చేసాము. డైలీ ఫైనాన్స్ పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే ఉపేక్షించేది లేదని సి ఐ భీమేష్ హెచ్చరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకొని వడ్డీలకు డబ్బులు ఇచ్చి వారి నుండి అధిక వడ్డీ వసూలు చేస్తున్నారని, ఆ వడ్డీలు చెల్లించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, చట్ట విరుద్ధంగా, అధిక వడ్డీ రేట్లతో సామాన్యులపై దౌర్జన్యం చేస్తే ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు ప్రభుత్వ అనుమతితో చట్టపరమైన పద్దతులలో ఫైనాన్స్ నిర్వహించే వారిని మాత్రమే నమ్మాలన్నారు. అక్రమ ఫైనాన్సు వ్యాపారం నడిపేవారి వివరాలు జిల్లా పోలీస్ కార్యాలయంలోగానీ డయల్ 100కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సిఐ కోరారు. సమాచారం ఇచ్చినవారి వివరాలను గోప్యంగా ఉంచడంతోపాటు సమగ్ర విచారణ చేసి బాధితులకు న్యాయం చేయడం లక్ష్యంగా పోలీస్ శాఖ పని చేస్తుందని ఆయన తెలిపారు.

**- సిఐ భీమేష్ ఇచ్చోడ**

## దిక్సూచి ఏచూరి

**ఆసిఫాబాద్, ప్రజానావ:** విద్యార్థి ఉద్యమాలకు దిక్సూచి సీతారాం ఏచూరి అని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్య దర్శి చాపిలె, సాయి కృష్ణ, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ అన్నారు. ఆదివారం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఎస్టీ పోస్ట్‌మెట్రిక్‌బాలుర హాస్టళ్లలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ మాజీ జాతీయ అధ్యక్షుడు కామ్రేడ్ సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారి మరణం యావత్ భారతదేశానికి తీరనిలోటు అని, ఒక కమ్యూనిస్టు విప్లవకారున్ని దేశం కోల్పోయిందని అన్నారు. అణగారిన వర్గాలకు రాజ్యాంగం ఇచ్చిన హక్కులు సామాజిక తరగతుల హక్కుల కోసం అలుపెరగని ఉద్యమాలు చేశారని, పార్లమెంటులో హక్కుల కోసం రాజ్యాంగ రక్షణ కోసం పోరాడారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వసాకే సాయికుమార్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గెడం టీకానంద్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు నితీన్, డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరి సతీష్, వడ్లూరి శ్రీకాంత్, డీవైఎఫ్ఐ జిల్లా నాయకురాలు భారతి, మంజుల డీవైఎఫ్ఐ కళాశాల అధ్యక్షులు, అరవిందు, నాయకులు కార్తీక్ విద్యార్థులు పాల్గొన్నారు.





# బతుకు నేర్పుతున్న బడి పంతులు

- ఆకట్టుకుంటున్న వడ్లూరి రాజేష్ విద్యాబోధన
- తోటి టీచర్లకు ఆదర్శంగా నిలుస్తు
- అవయవాలు డొనేట్ కు అంగీకారం

**చిత్తశుద్ధితో పాటు అంకిత భావంతో కూడిన ఔత్సాహిక ఉపాధ్యాయుడిగా పని చేస్తూ విద్యార్థులకు విద్యార్థులకు జీవశాస్త్రం విషయాలు అర్థం కావడానికి అంతర్గత అవయవాల పట్ల ఆముర్త భావనలు కలిగి ఉండరాదు అనే ఉద్దేశంతో టీ షర్ట్స్ ల పైన అంతర్గత అవయవాల చిత్రాలను ముద్రించి తరగతి గదిలో బోధించడంలో ఈయన దిట్ట సైన్సు విషయాలు పూర్తి అవగాహన పొందించేందుకు డూయింగ్ బై లర్నింగ్ విధానంలో బోధించేందుకు విద్యార్థులను ఫీల్డ్ విజిట్ చేయించి ప్రకృతిలో వివిధ మొక్కలు వాటి కణజాలాలు విధులను ప్రత్యక్షంగా చూపించడం ఈయన సొంతం. జిల్లా కేంద్రంలోని జనకాపూర్ లోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ గా వడ్లూరి రాజేష్ జీవశాస్త్రము విద్య బోధిస్తున్నాడు. బెస్ట్ ఉపాధ్యాయుడిగా అనేక పురస్కారాలు అందుకున్నాడు . తన అవయవాలు డొనేట్ చేయడానికి అంగీకార పత్రం రాసి ఇతరులకు రోల్ మోడల్ గా నిలిచాడు.**

**ఆసిఫాబాద్, ప్రజానావ:** చిత్తశుద్ధితో పాటు అంకిత భావంతో కూడిన ఔత్సాహిక ఉపాధ్యాయుడు వడ్లూరి రాజేష్. జిల్లా కేంద్రంలోని జనకాపూర్ లోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ జీవశాస్త్రము విద్య బోధిస్తున్నారు. అతను విద్యార్థులతో పాటు సమాజం యొక్క అభ్యున్నతికి తన రోల్ మోడల్ సేవలను అందిస్తున్నాడు . తోటి ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు స్నేహపూర్వక విధానాన్ని తో పాటు ఇటు పాఠశాలకు అటు సమాజానికి ఉపయోగపడే పనులను నిర్వర్తిస్తున్నారు . అకాడమిక్, కోకరికులర్ ఆక్టివిటీస్ లో అత్యుత్తమ సేవలు అందిస్తున్నారు. బడిబాట ప్రోగ్రాం హాజరు నమోదు పరచడం, డ్రాప్ అవుట్ రేటును తగ్గించడం వినూత్న బోధన వ్యూహాలను బోధిస్తున్నాడు. 10వ తరగతిలో మంచి ఫలితాలను రాబట్టడానికి చాలా ఉపయోగపడుతున్నాయి. అంతేకాకుండా విద్యార్థులకు జీవశాస్త్రం విషయాలు అర్థం కావడానికి గాను సైన్స్ అంటే సంక్లిష్టం కారాదు దీనిని మరింత సరళతరం చెయ్యాలి అనే ఉద్దేశం తో అంతర్గత అవయవాల పట్ల ఆముర్త భావనలు కలిగి ఉండరాదు అనే ఉద్దేశంతో టీ షర్ట్స్ ల పైన అంతర్గత అవయవాల చిత్రాలను ముద్రించి తరగతి గదిలో బోధించడంలో ఈయన దిట్ట. సైన్సు విషయాలు పూర్తి అవగాహన పొందించేందుకు డూయింగ్ బై లర్నింగ్ విధానములో బోధించేందుకు విద్యార్థులను ఫీల్డ్ విజిట్ చేయించి ప్రకృతిలో వివిధ మొక్కలు వాటి కణజాలాలు విధులను ప్రత్యక్షంగా చూపించడం ఈయన సొంతం. నిత్యం తరగతి గదిలో వివిధ సైన్సు విషయాలను ప్రత్యక్ష పద్ధతిలో లేబరేటరీలో ప్రయోగాలు చేస్తూ బోధిస్తారు .నేటి సాంకేతికతను విద్యార్థులకు దగ్గర చేస్తూ(ఐఎఫ్‌పీ) ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ ద్వారా పిల్లలకు విద్యాబోధన కొనసాగిస్తున్నారు. తన పాఠశాల విద్యార్థులను సైన్సులో రాష్ట్రస్థాయికి జిల్లా స్థాయికి అనేక అంశాలలో తీసుకువెళ్లారు. నేషనల్ సైన్స్ కాంగ్రెస్ సైన్స్ డ్రామ సైన్స్ సెమినార్ ఇన్స్పైర్ మనాక్ లాంటి వాటిలో రాష్ట్ర, జిల్లా స్థాయికి పోటీపడేలా చేశారు. విద్యార్థులలో సైన్స్ పట్ల అభిరుచి పెరిగేలా సమాజంలోని మూఢనమ్మకాలను తొలగించేలా చెకుముకి టాలెంట్ టెస్ట్ జన విజ్ఞాన వేదిక రాష్ట్రస్థాయి పోటీలు జనగామలో జరిగినప్పుడు పోటీపడేలా ప్రోత్సహించి తీసుకువెళ్లారు. నేషనల్ సైన్స్ కాంగ్రెస్ సిద్దిపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలకు కూడా తీసుకువెళ్లారు. రాష్ట్రస్థాయిలో అనేక అంశాలలో విద్యార్థులను ప్రోత్సహించారు. పాఠశాల స్థాయిలో సోషల్ మోబిలైజర్‌గా పీటిఏ అమ్మ ఆదర్శ పాఠశాల విషయాలలో పాఠశాల స్థాయిలో మౌలిక వసతుల కల్పనలో భాగంలో పాఠశాల యందు నీటి సమస్య ఉన్నప్పుడు భూగర్భ జలాన్ని పెంచడానికి గాను ఇంకుడు గుంతను ఏర్పాటు చేశారు. అధికారుల ,హెచ్ఎం సహకారంతో పాఠశాలలో హరితహారం , వన మహోత్సవం లాంటి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తూ విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుట గుంతలు తవ్వుట మొక్కలకి వేసవి కాలంలో విద్యార్థులతో కలిసి నీరు పోయుట చేశారు. ప్రతి మొక్కకు ఒక విద్యార్థికి బాధ్యత అప్పగిస్తూ సంరక్షించడం బాధ్యతగా సూచించారు. విద్యార్థుల జన్మదినం సందర్భంగా ఒక మొక్కను నాటడం ఆనవాయితీగా మిగిలింది .విద్యార్థులను పోటీపరీక్షలకు సంసిద్ధం చేస్తూ ఎన్ ఎం ఎం ఎస్ పాలిటెక్నికల్ నవోదయ గురుకుల పోటీ పరీక్షలతో పాటు క్విజ్, ఎల్ఐసి వారి ప్రతిభా పురస్కారాలు కోరమండల్ గర్ల్ చైల్డ్ వారి స్కాలర్షిప్ గ్రామీణ బాలికల ప్రతిభా పురస్కారాలు ప్రోత్సహించారు .డాక్టర్ రామచంద్రుడు ప్రకృతి వైద్యులు ఖమ్మం జిల్లా నేలకొండపల్లి ద్వారా శిక్షణ పొందిన తాను ఏమి తినాలి.. ? ఏమి తాగాలి... ? అనే అంశాలను తూచా తప్పకుండా పాటిస్తారు. వాటి విలువలను విద్యార్థులకు బోధిస్తారు.

## బెస్ట్ ట్రేనర్‌గా గుర్తింపు..

పాఠశాలలోనే ఇంకుడు గుంత కాదు , తన ఇంటి వద్ద ఇంకుడు గుంతను వివిధ రకాలైన మొక్కలను నాటారు. నేడు అవి మహావృక్షాలుగా ఉన్నాయి. సైన్సు ఉపాధ్యాయుడుగా ప్రకృతి పై తనకు ఉన్న మక్కువను చూపిస్తున్నారు. మోటివేషనల్ స్పీకర్ గా ఇంపాక్ట్ ఫౌండేషన్ గంప నాగేశ్వరరావు ద్వారా సర్టిఫైడ్ ట్రేనర్ గా గుర్తింపు పొంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మోటివేషన్ క్లాసెస్ చెబుతున్నారు . జడ్పీ ఎస్ ఎస్ జనకాపూర్, జడ్పీఎస్ఎస్(బాయ్స్) ఆసిఫాబాద్, బూరుగుడా లాంటి పాఠశాలల్లో అవగాహన తరగతులు నిర్వహించారు. స్పీకర్ గా ఉండడం వల్ల ఉచితంగా విద్యార్థులకు ఆన్లైన్లో జూమ్ ద్వారా యంగ్ మైండ్స్ లాంటి కార్యక్రమాల ద్వారా భారతీయ సంస్కృతి , సాంప్రదాయాలు, తల్లిదండ్రుల పట్ల భక్తి గౌరవం ను బోధిస్తున్నారు. సైన్స్‌వాలా విత్ స్టోరీస్‌వాట్సాప్‌గ్రూపును క్రియేట్ చేసి విద్యార్థులకు నైతిక విలువలు, విద్యా సంబంధ విషయాలు నైతిక విలువలు తో కూడిన 'కథలను' బోధిస్తున్నారు. ఇంపాక్ట్ ఫౌండేషన్ సర్టిఫైడ్ ట్రైనర్ కావడం మూలంగా విద్యార్థులకు 2023- 24 సంవత్సరం లో 10 వ తరగతి ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు పేరుతో జూమ్ లో సమావేశం ఏర్పాటు చేసి సర్టిఫికెట్లను బహుకరించారు. ఉచితంగా పుస్తకాల పంపిణీ చేశారు .




## అవయవాలను డొనేట్ కు అంగీకారం

**సమాజం పట్ల బాధ్యత కలిగిన వ్యక్తిగా 'అమ్మ డొనేషన్ ఐ' స్వేచ్ఛంద సంస్థలో ఆర్గనైజర్ గా ఉంటూ తన అవయవాలను డొనేట్ చేయడానికి అంగీకార పత్రం రాసి ఇచ్చారు.**



## విద్యార్థులకు ఆటల్లో ప్రోత్సాహం

పాఠశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్(పీఈటీ) లేని కారణంగా ఆ బాధ్యతను తీసుకొని అనేక పోటీల్లో విద్యార్థులను పాల్గొనేలా చేశారు . ఎంపీపీ కప్ సీజన్ వన్‌లో 18 పథకాలు, ఎంపీపీ కప్ సీజన్-2లో 4 పథకాలు సాధించారు. బెల్లంపల్లిలో చెస్ కాంపిటీషన్ జరిగితే అందులో ఒక విద్యార్థిని (దుర్గం రాజ్‌కుమార్) తన సొంత ఖర్చులతో తీసుకువెళ్లారు. పాఠశాల స్థాయిలో అనేక కార్యక్రమాలకు యాంకర్‌గా హోస్ట్ గా వ్యవహరిస్తారు.

## ప్లాస్టిక్ నివారణకై తోడ్పాటు

ఈనాడు ఈటీవీ సుజల సుఫలం ప్రోగ్రాం తో స్ఫూర్తి పొందిన తాను వాంకిడి మండలంలో జరిగిన లైవ్ ప్రోగ్రాంలో పాల్గొని నీటి ఆవశ్యకతను నీటి గుంతలు నీటి కాలువలు వాటి ప్రాముఖ్యతను వివరించడం జరిగినది. అప్పటినుండి స్ఫూర్తి పొందిన తాను ప్లాస్టిక్ నిషేధం పర్యావరణ సంరక్షణ లో భాగంగా కిరాణా దుకాణం వెళితే కాటన్ సంచులను తీసుకొని వెళ్లి సరుకులు కొని తేవడం అలవాటుగా మార్చుకున్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయుడిగా గుర్తింపు..

కొమరం భీమ్ జిల్లా స్థాయిలో 2022 సంవత్సరంలో ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎన్నికయ్యారు. అప్పటి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ చేతుల మీదుగా సన్మానం పొందారు. విద్యార్థులను (ఎన్‌జీసీ) నేషనల్ గ్రీన్ కార్ లాంటి కార్యక్రమాలలో పాల్గొనేలా చేసి అనేక పురస్కారాలు సాధించారు. అటవీ శాఖ దశాబ్ది ఉత్సవాలలో 19 జూన్ 2023 హరితహారం లో భాగంగా కలెక్టర్ హేమంత్ బోర్కడే చేతుల మీదుగా బహుమతితో పాటు, సర్టిఫికెట్ తీసుకున్నారు . మ్యాడుల్ రైటర్ గా 'అభ్యాసన దీపిక' అప్పర్ ప్రైమరీ లెవెల్ ఆరవ తరగతి ,ఏడవ తరగతి ,ఎనిమిదవ తరగతి లకు రాసినందుకు జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు చేతుల మీదుగా షీల్డ్, పెన్ను , సర్టిఫికెట్ను పొందారు. జిల్లా విద్యా శాఖ అధికారి బిక్షపతి ,డిఇఓ పార్సి అశోక్ ,గంప నాగేశ్వరరావు లాంటి వారి చేతుల మీదుగా అనేక బహుమతులు సర్టిఫికెట్లు పొందారు. రోల్ ప్లే పోటీలలో జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి పొందారు. కొమరం భీమ్ జిల్లా స్థాయిలో నిర్వహించిన ఉపన్యాస పోటీలు 'డ్రగ్ అడిక్షన్ కాంపిటీషన్స్'లో సెకండ్ బెస్ట్ ప్రైస్ డిస్టిక్ శేషన్స్ 'జడ్జ్ యువ రాజా' చేతుల మీదుగా తాను గైడ్ చేసిన విద్యార్థిని కే దివ్యశ్రీ ద్వారా బహుమతి తీసుకున్నారు. (25 జూన్ 2024న) ఎసెస్సీ ఇంటర్నల్ వెరిఫికేషన్ టీముల్లో అనేకసార్లు జడ్జిగా పాల్గొని బాధ్యతలు నిర్వర్తించారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
సోమవారం
16 సెప్టెంబర్ 2024


# చెన్నై చేరిన బంగ్లాదేశ్

**చెన్నై:** టెస్టు, టీ20ల సిరీస్ కోసం బంగ్లాదేశ్ జట్టు భారత్‌లో అడుగు పెట్టింది. పాకిస్థాన్‌పై చారిత్రక విజయంతో జోరు మీదున్న బంగ్లా బృందం ఆదివారం ఢాకా విమానాశ్రయం చేరుకుంది. ఎయిర్‌పోర్ట్‌లో కెప్టెన్ నజ్ముల్ హుసేన్ శాంటో, లిటన్ దాస్, ప్రధాన కోచ్ చండిక హుతురుసింగేలతో పాటు జట్టు సభ్యులు అభిమానులతో ఫొటోలు దిగారు. ఆ తర్వాత అంతా భాతర విమానం ఎక్కారు. సాయంత్రం కల్లా బంగ్లా జట్టు చెన్నైలో దిగింది. అక్కడి నుంచి టీమ్ హొటల్ చేరిన బంగ్లా క్రికెటర్లకు సిబ్బంది ఘన స్వాగతం పలికారు. స్వదేశంలో అల్లర్ల నేపథ్యలోనూ పాకిస్థాన్ గడ్డపై టెస్టు సిరీస్ గెలుపొందిన బంగ్లాదేశ్ విజయోత్సాహంతో భారత్‌కు వస్తోంది. తమ జట్టు సభ్యులు రెట్టించిన ఆత్మవిశ్వాసంతో ఉన్నారని కెప్టెన్ శాంటో అన్నాడు. 'ఇండియాతో సిరీస్ మాకు సవాలే. కానీ, పాకిస్థాన్‌పై విజయం సాధించాం. ఇప్పుడు మా జట్టు సభ్యులలో, బంగ్లా ప్రజల్లో విజయం సాధిస్తామనే నమ్మకం పెరిగింది' అని మీడియా సమావేశంలో శాంటో వెల్లడించాడు. భారత్, బంగ్లాల మధ్య తొలి టెస్టు సెప్టెంబర్ 19న, అనంతరం కాన్పూర్‌లో సెప్టెంబర్ 27న రెండో టెస్టు జరుగనుంది. ఆ తర్వాత టీ20 సిరీస్‌లో ఇరుజట్లు తలపడనున్నాయి. అక్టోబర్ 3న గ్వాలియర్‌లో తొలి మ్యాచ్, అక్టోబర్ 9న ఢిల్లీలో రెండో టీ20, అక్టోబర్ 12న హైదరాబాద్‌లో మూడో టీ20 జరుగనున్నాయి.





# ఆస్ట్రేలియా గడ్డపై హ్యాట్రిక్ కొడుతాం

ప్రతిష్ఠాత్మక బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ ఆరంభానికి ముందే మాటల యుద్ధానికి తెర లేచింది. భారత్, ఆస్ట్రేలియా దేశాల మాజీ క్రికెటర్లు ఇప్పటికే తమ జట్టు గెలుస్తుందంటే.. తామే విజేతలం అవుతామంటూ పోటాపోటీగా వ్యాఖ్యలు చేస్తున్నారు. తాజాగా భారత స్పీడ్‌స్టర్ మహమ్మద్ షమీ సైతం ఈ సిరీస్‌పై స్పందించాడు. ఈసారి కూడా తామే ఫేవరెట్లమని, ఆస్ట్రేలియా గడ్డపై హ్యాట్రిక్ కొడుతామని షమీ కంగారూ జట్టును హెచ్చరించాడు. ఆస్ట్రేలియాపై చిరస్మరణీయ విజయాలతో చరిత్ర సృష్టించిన భారత జట్టు నవంబర్‌లో మళ్లీ అక్కడికి వెళ్లనుంది. ఇప్పటికే 2018-19, 2020-21లో విజేతగా నిలిచిన టీమిండియా ఈసారి కూడా విజయంపై ధీమాతో ఉంది. ఈ నేపథ్యంలో షమీ భారత్‌దే ట్రోఫీ అని చెప్పేశాడు. 'భారత జట్టే ఫేవరట్ అని నేను గట్టిగా నమ్ముతున్నా. గత ఆసీస్ పర్యటనలో సీనియర్లు లేరు. యువకులతో కూడిన జట్టుతోనే ఆడాం. ఇప్పటికీ మాదే గొప్ప అని నిరూపించుకుంటాం. అయితే.. ఈసారి ఆసీస్ నుంచి గట్టి పోటీ ఎదురుకానుంది. అయినా సరే గెలిచేది టీమిండియానే అని కోల్‌కతాలో జరిగిన ఓ అవార్డుల కార్యక్రమంలో' షమీ తెలిపాడు. వరల్డ్ కప్ తర్వాత మోకాలి సర్జరీ నుంచి కోలుకున్న షమీ.. ప్రస్తుతం ఫిట్‌నెస్ మీద దృష్టి పెట్టాడు. పునరాగమనంపై తానేమీ తొందరపడడం లేదని, మానసికంగా.. శారీరకంగా ఫిట్‌గా మారాకే ఇండియా తరపున ఆడుతా' అని ఈ సందర్భంగా షమీ అక్కడి అభిమానులతో చెప్పాడు. త్వరలో జరుగబోయే బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్‌కు దూరమైన షమీ ఆస్ట్రేలియా సిరీస్‌లోపు ఫిట్‌నెస్ సాధించాలని భారత మేనేజ్‌మెంట్ సహా, అభిమానులంతా కోరుకుంటున్నారు.



# ధీటుగా జవాబిస్తున్న ఇండియా బీ జట్టు!

**అనంతపూర్:** యువ ఆల్‌రౌండర్, హర్యానా క్రికెటర్ అన్షుల్ కంబోజ్ నిప్పులు చెరిగాడు. ప్రతిష్టాత్మక దులీప్ ట్రోఫీలో రుతురాజ్ గైక్వాడ్ సారథ్యంలోని ఇండియా సి జట్టు తరుఫున ఆడుతున్న అన్షుల్ కంబోజ్.. ఇండియా బితో జరుగుతున్న మ్యాచ్‌లో ఐదు వికెట్ల ఘనతను అందుకున్నాడు. బ్యాటింగ్‌లో 38 పరుగులే చేసినా.. బౌలింగ్‌లో మాత్రం నిప్పులు చెరిగాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లోనే తొలి సారి ఐదు వికెట్ల ఘనతను అందుకున్నాడు. 523 పరుగుల టార్గెట్ తో తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇండియా-బి జట్టు కు అన్షుల్ కంబోజ్ షాక్ ఇచ్చాడు. మూడో రోజు మ్యాచ్‌లో ఐదు వికెట్ల ఘనతను అందుకున్నాడు. బౌలింగ్‌కు ఏమాత్రం అనుకూలం లేని ఫ్లాట్ వికెట్‌పై తొలి ఇన్నింగ్స్‌లో ఐదు కీలక వికెట్లు తీసాడు. ఇక విజయ్‌కుమార్ వైషాక్, మయాంక్ మార్కండే చెరో వికెట్ సాధించారు. అయితే, ఇండియా బి జట్టు కూడా ధీటుగా జవాబిస్తుంది. మూడో ఆట ముగిసేసరికి 101 ఓవర్లకు 309/7 పరుగులు సాధించింది. దీంతో 216 పరుగులు వెనుకంజలో ఉంది. క్రీజులో కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్(143 బ్యాటింగ్) సెంచరీతో ఒంటరి పోరాటం చేస్తున్నాడు. అతనికి తోడుగా రాహుల్ చాహర్ (18 బ్యాటింగ్) ఉన్నాడు. అంతకముందు నారాయణ్ జగదీశన్ (70) అర్ధ శతకంతో రాణించాడు.



# ఇండియా-ఏ జయభేరి



**అనంతపూర్:** దులీప్ ట్రోఫీ రెండో రౌండ్‌లో ఇండియా-ఎ జట్టు విజయభేరి మోగించింది. అనంతపురంలోని ఆర్డీటీ స్పోర్ట్స్ సెంటర్‌లో జరిగిన మ్యాచ్‌లో ఇండియా-ఎ జట్టు 186 పరుగుల భారీ తేడాతో ఇండియా-డిపై భారీ విజయం సాధించింది. 488 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఇండియా-డి చివరికి 82.2 ఓవర్లలో 301 పరుగులకే ఆలౌటైంది. తెలుగు తేజం రిక్కీ భుయ్ (113బీ 195 బంతుల్లో 14 ఫోర్లు, 3 సిక్సులు) విరోచిత ఇన్నింగ్స్‌తో సెంచరీ సాధించినా ఫలితం లేకుండా పోయింది. అతడికి ఇతర ప్లేయర్ల నుంచి సహకారం అందకపోవడంతో డి జట్టుకు ఓటమి తప్పలేదు. ఇండియా ఎ విజయంలో కీలక పాత్ర పోషించిన ఆల్‌రౌండర్ శమ్స్ ములానీకి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది. ఈ మ్యాచ్ ములానీ 89 పరుగులతో పాటు తొలి ఇన్నింగ్స్‌లో ఒక వికెట్, రెండో ఇన్నింగ్స్‌లో మూడు వికెట్లు తీశాడు. కాగా, ఇండియా-ఎకి ఇది తొలి విజయం కాగా.. ఇండియా-డికి ఇది వరుసగా రెండో ఓటమి.

## సెంచరీతో కదంతొక్కిన రిక్కీ భుయ్..

488 పరుగుల లక్ష్యఛేదనలో భాగంగా ఆదివారం చివరిదైన నాలుగో రోజు ఇండియా-డి 62/1 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించింది. ఓవర్‌నైట్ బ్యాటర్లు యష్‌దుబే, రిక్కీ భుయ్‌లు నెమ్మదిగా పరుగులు రాబట్టే ప్రయత్నం చేశారు. యష్ దుబే 94 బంతుల్లో 5 బౌండరీల సహాయంతో 37 పరుగులు చేసి రనౌట్ అయ్యాడు. రెండో డౌన్‌లో వచ్చిన దేవ్‌దత్ పడిక్కల్ కేవలం ఒక పరుగు చేసి శమ్స్ ములానీ బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ అయ్యాడు. ఈ దశలో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, రిక్కీ భుయ్ ఇండియా-డి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే బాధ్యత తీసుకున్నారు. వీరిద్దరూ అవకాశం దొరికినప్పుడల్లా బంతిని బౌండరీలకు తరలిస్తూ స్కోరుబోర్డును ముందుకు సాగించారు. ఈ క్రమంలోనే దూకుడుగా ఆడుతున్న సారథి శ్రేయస్ 55 బంతుల్లో 8 ఫోర్లతో 41 పరుగులు చేసి వెనుదిరిగాడు. అనంతరం వికెట్ కీపర్ బ్యాటర్ సంజు శామ్సన్ క్రీజులోకి వచ్చాడు. ఇతను వచ్చి రావడంతోనే ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఫోర్లు, సిక్సర్లతో ఆలరిస్తూ 45 బంతుల్లోనే 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 40 పరుగులు చేసి మరో భారీ షాట్‌కు ప్రయత్నించి తన వికెట్ కోల్పోయాడు. ఓ వైపు వికెట్లు పడుతున్నా.. రిక్కీ భుయ్ మాత్రం దూకుడుగా ఆడుతూ చూడచక్కని షాట్లతో అందరినీ అలరించాడు. ఈ క్రమంలోనే భుయ్ 170 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆ కొద్ది సేపటికే తనుష్ కోటియన్ బౌలింగ్‌లో కీలక ఇన్నింగ్స్ ఆడిన రిక్కీ భుయ్ (113) పెవిలియన్‌కి చేరాడు. ఆ తర్వాత సౌరభ్ కుమార్ (22), హర్షిత్ రాణా (24) కూడా ఔటవడంతో ఇండియా-డి ఇన్నింగ్స్ 301 పరుగుల వద్ద ముగిసింది. దీంతో ఇండియా ఏకు 186 పరుగుల విజయం దక్కింది. వీరి బౌలర్లలో శమ్స్ ములానీ 3, తనుష్ కొటియన్ 4 వికెట్లు పడగొట్టగా.. రియన్ పరాగ్ ఖలీల్ అహ్మద్ చెరో వికెట్ దక్కించుకున్నారు.

# ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..

6 | సోమవారం
16 సెప్టెంబర్ 2024


## మంత్రాల నెపంతో ఐదుగురి హత్య




**రాయ్‌పూర్:** చత్తీస్‌గఢ్ సుక్మా జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. మంత్ర విద్యలు ప్రదర్శిసున్నారని, క్షుద్ర పూజలు చేస్తున్నారని ఆరోపిస్తూ ఇక్కడి ఓ గ్రామంలో ఐదుగురు వ్యక్తులను తీవ్రంగా కొట్టి చంపేశారు. గిరిజనులు అత్యధికంగా నివసిస్తున్న సుక్మా జిల్లా ఇక్తాల్ గ్రామంలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుందని జిల్లా పోలీసులు తెలిపారు. ఇద్దరు దంపతులను, మరో మహిళను తీసుకొచ్చి దారుణంగా హింసించి, చంపేశారని, ఘటనకు సంబంధించి ఐదుగురు నిందితులను అరెస్టు చేశామని జిల్లా పోలీసు అధికారి ఒకరు చెప్పారు. తాజా ఘటన రాష్ట్రంలో పెను సంచలనం రేపింది. మూడు రోజుల క్రితం ఇదే విధమైన ఘటన భాతపరా జిల్లాలో చోటుచేసుకుంది. చేతబడి చేస్తున్నాడని ఆరోపిస్తూ ఓ కుటుంబానికి చెందిన నలుగురిని కొంతమంది హత్య చేశారు.




### కొత్త నిబంధనలతో

# భక్తుల మనోభావాలు దెబ్బతీయొద్దు

- ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనం ఏర్పాట్లు చేయకుంటే వినాయకులను అలాగే ఉంచుతాం
- భాగ్యనగర్ ఉత్సవ సమితి ఆగ్రహం
- పోలీసులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బారికేడ్ల తొలగింపు

**ఖైరతాబాద్, ప్రజానావ:** ట్యాంక్‌బండ్‌పై వినాయక నిమజ్జనం అనేక ఏండ్లుగా కొనసాగుతున్నదని, కొత్త రూల్స్ తీసుకొచ్చి.. భక్తుల మనోభావాలు దెబ్బతీస్తున్నారంటూ భాగ్యనగర్ ఉత్సవ సమితి సభ్యులు మండిపడ్డారు. ఆదివారం హుస్సేన్ సాగర్ వద్ద ఆందోళన చేపట్టిన ఉత్సవ సమితి సభ్యులు.. ట్యాంక్‌బండ్‌పై వినాయక నిమజ్జనం లేదంటూ పోలీసులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బారికేడ్లను తొలగించారు. వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. ట్యాంక్‌బండ్‌పై నిమజ్జన ఏర్పాట్లు చేయాలని, లేదంటే సోమవారం అన్ని మండపాల నిర్వాహకులకు సమాచారమిచ్చి.. నగరవ్యాప్తంగా ఆందోళన చేసి.. ఎక్కడికక్కడ మండపాల్లో వినాయకులను అలాగే ఉంచుతామని హెచ్చరించారు. ఉత్సవ సమితి సభ్యుల ఆందోళనకు దిగొచ్చిన ప్రభుత్వం హడావిడిగా ట్యాంక్‌బండ్‌పై ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

### విద్యుత్ అంతరాయం తలెత్తకుండా..

గణేశ్ విగ్రహాల శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమం సజావుగా జరిగేందుకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ అన్ని ఏర్పాట్లు చేసింది. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ఉండేందుకు 10 సర్కిళ్ల పరిధిలోని ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి, క్షేత్ర స్థాయిలో ఉండి పర్యవేక్షణ చేయాలని సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ఇప్పటికే ఆదేశించారు. ఇందులో భాగంగానే ఎన్టీఆర్ మార్గ్‌లో విద్యుత్ శాఖ ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ని ఇటీవలే సీఎండీ ప్రారంభించారు. నిమజ్జనం సందర్భంగా ప్రత్యేకంగా నిర్ణయించిన మార్గాల్లో శోభాయాత్రను నిర్వహిస్తున్న నేపథ్యంలో సరఫరా నిరంతరం ఉండేందుకు, విద్యుత్ అదనపు లోడ్‌కు సరిపోయేలా 500 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు, 315 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు 31, 160 కేవీఏ సామర్థ్యంతో కూడిన 37 ట్రాన్స్‌ఫార్మను ఏర్పాటు చేసినట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. బాలాపూర్ నుంచి హుస్సేన్ సాగర్ వరకు సాగే గణేశ్ విగ్రహాల శోభాయాత్ర కోసం సుమారు 55 కి.మీ మేర 11 కేవీ ఎల్టీ కేబుళ్లు, పోల్స్, కండక్టర్లు ఏర్పాటు చేశామన్నారు. కాగా, శోభాయాత్ర మొదలై నిమజ్జనం పూర్తయ్యే వరకు సూపరింటెండెంట్ ఇంజినీర్లు, డివిజినల్ ఇంజినీర్లు క్షేత్ర స్థాయిలో ఉండి పర్యవేక్షణ చేయనున్నారు. హుస్సేన్సాగర్ తీరంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటారని, మండప నిర్వాహకులు, ప్రజలు విద్యుత్ భద్రత సూచనలు పాటిస్తూ ఎక్కడైనా అవాంఛనీయ పరిస్థితులు ఏర్పడితే కంట్రోల్ రూమ్ లేదా 100, 1912 నంబర్లకు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు.

### సర్వం సిద్ధం..

గణపతి నవరాత్రోత్సవాల్లో కీలక ఘట్టమైన నిమజ్జనానికి అధికార యంత్రాంగం ఏర్పాట్లు



పూర్తి చేసింది. హెచ్ఎండీఏ, ఆర్అండ్‌బీ, జలమండలి, గ్రేటర్ డిస్కం, పర్యాటక, పోలీస్ శాఖలు సమన్వయం చేసుకుంటూ.. ప్రశాంత వాతావరణంలో నిమజ్జన ప్రక్రియను పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాయి. హుస్సేన్ సాగర్, జీడిమెట్ల ఫాక్స్‌సాగర్, బహదూర్పూర, మిరాలం చెరువు, కాప్రా ఊర చెరువు, సరూర్ నగర్ ట్యాంక్‌బండ్‌తో సహా పీవోపీ విగ్రహాల కోసం ప్రత్యేకంగా 73 కొలనులను ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో క్రేన్లను అందుబాటులో ఉంచారు.


ఆరు జోన్ల పరిధిలో స్టాటిక్ క్రేన్స్ 21, మొబైల్ క్రేన్స్ 295, 213 గణేశ్ యాక్షన్ బృందాలను నియమించారు. వ్యర్థాలను తరలించేందుకు మినీ టిప్పర్లు 102, 125 జేసీబీలను సిద్ధం చేశారు. శోభాయాత్రకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వహణ పనులతో పాటు తాత్కాలిక పనులు చేపట్టారు. నిర్వహణ పనులు 172లకు రూ.12 కోట్లు, తాత్కాలిక పనులు 36కి గానూ రూ.16కోట్లు ఖర్చు చేస్తున్నారు. 52వేల లైట్లను బిగించారు. 309 మొబైల్ టాయిలెట్లను అందుబాటులో ఉంచారు.



## రాజన్న ఆలయంలో వైభవంగా నవరాత్రులు

**వేములవాడ, ప్రజానావ:** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ప్రతిరోజు శ్రీ లక్ష్మీ గణపతి స్వామి వారికి మహాభిషేకం, శ్రీ స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతార్చనలు జరిగాయి. ఆదివారం ఉదయం నాగిరెడ్డి మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వినాయక విగ్రహం వద్ద పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ కే.వినోద్ రెడ్డి, నమిలకొండ ఉమేశ్ శర్మ, ఏఈఓ శ్రీనివాస్, సూపరింటెండెంట్ తిరుపతిరావు, రాజేందర్, ఆలయ అర్చకులతో పాటు రాజన్న జిల్లా బీజేపీ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ పాల్గొన్నారు. సాయంత్రం వినాయక స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పెద్ద సేవపై వినాయక విగ్రహాన్ని ప్రతిష్టించి, పట్టణ -పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించిన తర్వాత ఆలయ ధర్మగుండంలో నిమజ్జనం చేశారు.





టీపీసీసీ అధ్యక్షుడిగా బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ ప్రమాణ స్వీకారోత్సవంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్కు శుభాకాంక్షలు చెప్పి రాజన్న ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమం ఆదివారం గాంధీ భవన్‌లో నిర్వహించారు.

- వేములవాడ, ప్రజానావ



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌ను ఆదివారం ఎర్రవెల్లిలో మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, జీవన్ రెడ్డి, మర్రి జనార్దన్ రెడ్డి, కోరుకంటి చందర్

- గజ్వేల్, ప్రజానావ

## ఇంట్లోకి చొరబడి చైన్ లాక్కెళ్లిన దుండగుడు



- రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లిలో ఘటన

**తంగళ్లపల్లి, ప్రజానావ:** వృద్ధురాలి మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు చైన్ను ఓ దుండగుడు ఇంట్లోకి చొరబడి లాక్కెళ్లాడు. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి సబ్బని రుక్కుంబాయి అనే వృద్ధురాలు ఇంట్లో వంట చేస్తుండగా గుర్తు తెలియని దుండగుడు ఇంట్లోకి చొరబడి మెడలో ఉన్న చైన్ తెంపుకొని పరారయ్యాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు.



ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
సోమవారం
16 సెప్టెంబర్ 2024






# మహా గణపతి దర్శనానికి పోటెత్తిన భక్తులు

**ఖైరతాబాద్, ప్రజానావ:** ఖైరతాబాద్ గణేశుడి దర్శనానికి భారీగా భక్తులు పోటెత్తారు. మంగళవారం నిమజ్జనం నేపథ్యంలో దర్శనానికి ఆదివారం రోజు చివరి రోజు కావడంతో జంట నగరాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి మహా వినాయకుడిని దర్శించుకునేందుకు భక్తులు క్యూకట్టారు. ఖైరతాబాద్ మెట్రో స్టేషన్, టెలిఫోన్ భవన్ వైపు రద్దీ ఎక్కువగా ఉంది. దర్శనానికి చివరిరోజు కావడంతో భక్తుల రద్దీకి అనుగుణంగా సెక్యూరిటీ ఏర్పాట్లు చేశామని, ఎక్కడా ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నామని పోలీసులు చెప్పారు. సీసీ కెమెరాల ద్వారా ప్రత్యేకంగా మానిటరింగ్ చేస్తున్నట్లు చెప్పారు. భారీ గణనాథుడిని చూసేందుకు భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఐమాక్స్ మార్గంలో తొక్కిసలాట జరిగినట్లు సమాచారం. అర్ధరాత్రి వరకే మహాగణపతి దర్శనానికి సమయం ఉండడంతో లక్షలాది మంది దర్శనం కోసం తరలివచ్చారు. క్యూలైన్లో భక్తులు ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అయ్యారు. వృద్ధులు సొమ్మసిల్లి పడిపోయారని.. చిన్నారులు సైతం తీవ్ర ఇబ్బందులుపడ్డారు. భక్తులు, వాహనాలతో ఖైరతాబాద్ ప్రాంతం మొత్తం కిక్కిరిసిపోయింది. ఖైరతాబాద్తో పాటు ఎన్టీఆర్ మార్గ్లో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఈ క్రమంలో ఖైరతాబాద్ మెట్రో స్టేషన్‌కు విపరీతంగా రద్దీ పెరిగింది. నిన్న ఒకేరోజు 94వేల మంది ఈ స్టేషన్ నుంచి ప్రయాణించారు. ఆదివారం లక్షకుపైగానే రాకపోకలు నమోదైనట్లుగా తెలుస్తున్నది. మరో వైపు ఖైరతాబాద్‌లో పలుచోట్ల తేలికపాటి వర్షం కురిసింది. ఇదిలా ఉండగా.. ఖైరతాబాద్ మహా వినాయకుడి శోభాయాత్ర మంగళవారం ఉదయం ప్రారంభమై.. మధ్యాహ్నం వరకు నిమజ్జనం ముగియనున్నది. ఈ క్రమంలో శోభాయాత్రకు సంబంధించి వెల్డింగ్ తదితర పనుల కోసం సోమవారం దర్శనాలను నిలిపివేయనున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.





వరద బాధితుల సహాయార్థం ప్రఖ్యాత సువెన్ లైఫ్ సైన్సెస్ సంస్థ ముఖ్యమంత్రి సహాయ నిధికి 2 కోట్ల రూపాయల విరాళం అందించింది. సంస్థ చైర్మన్ సీఈవో వెంకట్ జాస్తి ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్ నివాసంలో కలిసి విరాళం చెక్కును అందజేశారు. సహాయ కార్యక్రమాల కోసం ఉదారతను చాటుకున్న వారిని ముఖ్యమంత్రి అభినందించారు.

**- ఖైరతాబాద్, ప్రజానావ**

## రెండు రోజుల్లో రాజీనామా

- **ఢిల్లీ సీఎం సంచలన నిర్ణయం**

**న్యూఢిల్లీ:** ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. రెండు రోజుల్లో తన పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించారు. వచ్చే ఫిబ్రవరిలో ఢిల్లీ ఎన్నికలు జరగాల్సి ఉన్నదని, కానీ.. నవంబర్లో మహారాష్ట్రతో పాటే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ముందస్తు ఎన్నికల వ్యూహంలో భాగంగానే ఆయన రాజీనామా ప్రకటన చేసినట్లు విశ్లేషకులు చెబుతున్నారు. ఆదివారం ఢిల్లీలోని ఆప్ కార్యాలయంలో పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి కేజ్రీవాల్ మాట్లాడారు. 'నిర్దోషులుగా నిరూపించుకొనేవరకు నేను సీఎంగా, మనీశ్ సిసోడియా డిప్యూటీ సీఎం పదవి చేపట్టబోం. కొత్త సీఎం ఎంపికపై రెండు, మూడు రోజుల్లో పార్టీ సమావేశం ఏర్పాటు చేస్తాం. ఆప్‌లో చీలికలు తెచ్చి ఢిల్లీలో అధికారం చేపట్టేందుకు బీజేపీ కుట్రలు చేసింది. పార్టీని ముక్కలు చేసేందుకు నన్ను జైలుకు కూడా పంపారు. కానీ పార్టీని విచ్ఛిన్నం చేయలేకపోయింది. ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా రాజ్యాంగాన్ని కాపాడేందుకు నేను ఇన్ని రోజులు రాజీనామా చేయలేదు. జైలు నుంచి ప్రభుత్వాన్ని ఎందుకు నడిపించకూడదని సుప్రీం ప్రశ్నించింది. నాకు బీజేపీ ముఖ్యం కాదు. ప్రజలే ముఖ్యం' అని వెల్లడించారు.






ఇటీవల అనారోగ్యంతో మరణించిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డి దశ దినకర్మ కార్యక్రమానికి కేటీఆర్ హాజరయ్యారు. భువనగిరిలో జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు పార్టీ నేతలతో కలిసి ఆయన హాజరయ్యారు. ముందుగా జిట్టా బాలకృష్ణారెడ్డి చిత్రపటానికి కేటీఆర్ నివాళులర్పించి, అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి వాళ్ళని ఓదార్చారు. ఈ సందర్భంగా జిట్టాతో ఉన్న అనుబంధాన్ని కేటీఆర్ గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్న జిట్టా బాలకృష్ణారెడ్డి లేరన్న వార్త నమ్మలేకపోతున్నానని చెప్పారు. ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని కుటుంబసభ్యులకు సూచించారు. జిట్టా కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

**- భువనగిరి, ప్రజానావ**

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
8
సోమవారం
16 సెప్టెంబర్ 2024



# పెళ్లి చేసుకున్న హీరోయిన్ మేఘా ఆకాష్

నటి మేఘా ఆకాష్ తెలుగు, తమిళ చిత్రాలతో బాగా పాపులర్. మేఘా ఆకాష్ నటుడు సాయి విష్ణుని వివాహం చేసుకుంది. సెప్టెంబర్ 15న చెన్నైలో ఈ వేడుక జరిగింది. తన చిరకాల మిత్రుడు సాయి విష్ణునే మేఘా ఆకాష్ చేసుకోవడం విశేషం. అనేక మంది ప్రముఖులు నటి వివాహానికి హాజరయ్యారు. ఈ జంటకు సోషల్ మీడియాలో అభిమానులు, స్నేహితులు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలిపారు. సాయివిష్ణు ప్రముఖ తమిళ రాజకీయ నాయకుడు తిరునావుకరసు కుమారుడు. వీరి పెళ్లి రిసెప్షన్ కు తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్, ఉదయనిధి, దురై మురుగన్‌తో సహా పలువురు రాజకీయ నాయకులు హాజరయ్యారు. మేఘా ఆకాష్, సాయివిష్ణు ఒక దశాబ్దం నుండి ఒకరికొకరు తెలుసు. వీరిద్దరూ గత 6 సంవత్సరాలుగా రిలేషన్‌షిప్‌లో ఉన్నారు. ఈ విషయం ఇరు కుటుంబాలకు తెలుసు. మేఘా ఆకాష్ గత ఆగస్టులో సాయి విష్ణుతో నిశ్చితార్థం చేసుకుంది. మేఘా ఆకాష్ లై, చల్ మోహన్ రంగ, రాజ రాజ చోర, గుర్తుందా శీతాకాలం, రావణాసుర, మను చరిత్ర లాంటి సినిమాల్లో నటించింది.



# రొమాంటిక్ సీన్స్ చేయడం అంత సులభం కాదు

## మాళవిక మోహనన్

ఇటీవలే తంగలాన్ తో సూపర్ హిట్ అందుకుంది హీరోయిన్ మాళవిక మోహనన్. ప్రస్తుతం చేతినిండా లతో చాలా బిజీగా ఉంది ఈ ముద్దుగుమ్మ. తెలుగుతోపాటు హిందీ చిత్రపరిశ్రమలోకి కూడా ఎంట్రీ ఇస్తుంది. యుధ్రా మూవీతో బాలీవుడ్ ఇండస్ట్రీలోకి తెరంగేట్రం చేస్తుంది మాళవిక. అయితే ఇందులో కొన్ని రొమాంటిక్ సన్నివేశాల్లో నటించింది. తాజాగా అలాంటి సీన్స్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. రొమాంటిక్ సీన్స్ చేయడం అంత సులభం కాదన్నారు. రొమాంటిక్ సీన్స్ చిత్రీకరించేటప్పుడు ఏ సెట్ లోనైనా అందుకు సంబంధించిన కో ఆర్డినేటర్ ను నియమిస్తున్నారు. నటీనటులు ఆ సీన్స్ చేసేముందు ఇబ్బందిపడకుండా ఎలా యాక్ట్ చేయాలో వారు చెబుతుంటారు. అది చాలా మంచి నిర్ణయం. కానీ సాథియా సాంగ్ గురించి చెప్పినప్పుడు నేను, సిద్ధాంత్ చాలా కంగారుపడ్డాం. మేము చేయగలమా అని సందేహపడ్డాం. సముద్ర తీరం, చలి ఎక్కువగా ఉంది. దీంతో తొందరగా షూట్ కంప్లీట్ చేయాలని డైరెక్టర్ చెప్పినట్లు చేసేశాం. రొమాంటిక్ సీన్స్ చేయడం అంత సులభం కాదు. నటీనటుల మధ్య మంచి అనుబంధం ఉండాలి. సౌకర్యవంతమైన వాతావరణం కూడా ఉండాలి అంటూ చెప్పుకొచ్చింది మాళవిక. ఈ చిత్రం సెప్టెంబర్ 20న విడుదల కానుంది.



# కాంచన 4లో పూజా హెగ్డే!

నార్త్ లో రష్మిక మందదుగేస్తే, సౌత్‌లో ఓ హిట్ ఫ్రాంచైజీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారు మిస్ పూజా హెగ్డే. రాఘవ లారెన్స్ కెరీర్‌లో కాంచన సీరీస్ ఎంత పెద్ద హిట్టో స్పెషల్‌గా పరిచయం చేయక్కర్లేదు. ఇప్పుడు ఆ హిట్ ఫ్రాంచైజీలో ఫోర్త్ చాప్టర్‌కి సైన్ చేశారట పూజా. సౌత్‌లో స్ట్రాంగ్ కమ్‌బ్యాక్ కోసం ట్రై చేస్తున్న పూజా హెగ్డే కి కాంచన పర్ఫెక్ట్ మూవీ అంటున్నారు క్రిటిక్స్. ఆల్రెడీ సూర్యతో ఓ చేస్తున్నారు మేడమ్ పూజా. అనూహ్యంగా ఏదైనా కాన్సెప్ట్ హిట్ అయితే, వెంటనే ఆ జోనర్‌లో పాలోమంటూ పది లు క్యూలో ఉంటాయంటారు. రీసెంట్‌గా స్త్రీ2 సక్సెస్ కాగానే అందరూ ఈ విషయం గురించే డిస్కస్ చేసుకున్నారు. దానికి తగ్గట్టుగానే అనౌన్స్‌మెంట్ల పరంపర కూడా స్ట్రాంగ్ గానే ఉంది మరి. స్త్రీ2 కలెక్షన్లు చూసి కళ్లు తిరిగాయి బాక్సాఫీస్ పండిట్స్ కి. ఇవేం కలెక్షన్లురా బాబూ.. ఓ హారర్ కు ఆడియన్స్ ఇంతలా కనెక్ట్ అవుతారా అనుకున్నారు. స్త్రీ కున్న చరిష్మా అలాంటిది మరి. ఆ క్రేజ్‌తో ఈ మరింత జోరుగా కొట్టుకొచ్చేసింది అని విశ్లేషించిన వారూ లేకపోలేదు. వాళ్లు ఏమనుకుంటే ఏంటి.. జనాల ఆదరణ పొందే జోనర్లను మనం ఎందుకు మిస్ చేసుకోవాలి. మనం కూడా ఆ రూట్లోనే ఓ సారి ట్రావెల్ చేసొస్తే పోతుందిగా అనుకుంటున్నారు వాంపైర్స్ ఆఫ్ విజయ్‌నగర్ మేకర్స్. రష్మిక కీ రోల్ చేస్తున్న ఈ కూడా హారర్ బ్యాక్‌డ్రాప్‌లో సాగుతుంది. హంపి నేపథ్యంలో తెరకెక్కే ఈ కు ఇప్పుడు నార్త్ లో మంచి బజ్ ఉంది. అసలే యానిమల్ సక్సెస్ మీదున్న రష్మిక ఇప్పుడు హారర్ లో ఎలా మెప్పిస్తారో చూడాలన్నది వారి ఇంట్రస్ట్. నార్త్ లో రష్మిక మందదుగేస్తే, సౌత్‌లో ఓ హిట్ ఫ్రాంచైజీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారు మిస్ పూజా హెగ్డే. రాఘవ లారెన్స్ కెరీర్‌లో కాంచన సీరీస్ ఎంత పెద్ద హిట్టో స్పెషల్‌గా పరిచయం చేయక్కర్లేదు.



Printed, Published and Owned by Adula Thirupathi, Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street, Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO: TELTEL/2023/87657